సమీకృత మార్కెట్‌ను తీసేస్తాం

● నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం

పీపుల్స్ క్వశ్చన్ అవర్‌లో ప్రజల ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం

నకిరేకల్, మార్చి 20 : పట్టణంలోని మూసీరోడ్డులో నిర్మాణంలో ఉన్న సమీకృత మార్కెట్‌ను వంద శాతం తీసేస్తామని, చేపలు, కోళ్ల వ్యర్థాలతో పక్కనే ఉన్న హాస్టల్ విద్యార్థులు అనారోగ్యం పాలవుతారనే ఉద్దేశంతోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎమ్మెల్యే వేముల వీరేశం తెలిపారు. 'కాంగ్రెస్ ప్రజా పాలనకు వందరోజులు– ప్రజా నాయకుడికి 100 ప్రశ్నలు'లో భాగంగా నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలో బుధవారం పీపుల్స్ క్వశ్చన్ అవర్ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ అభివృద్ధిపై ప్రజలు, విలేకరులు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పారు. విజన్ నకిరేకల్ పేరుతో 200 మందితో అఖిలపక్ష కమిటీని వేసి మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగస్వాములం చేస్తామన్నారు. సొంత నిధులు రూ.20 లక్షలతో క్రైస్తవులకు శ్మశానవాటిక నిర్మాణం చేపడతామన్నారు. తాటికల్ రోడ్డు విస్తరణలో భాగంగా ఇంటి యజమానులకు పరిహారం చెల్లించిన తరువాతే రోడ్డు విస్తరణ చేస్తామన్నారు. గంజాయి రహిత నకిరేకల్‌గా చేయడమే ముందున్న లక్ష్యమన్నారు. ప్రతి సంవత్సరం నియోజకవర్గ అభివృద్ధిపై పీపుల్స్ క్వశ్చన్ అవర్ నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజర్ల శంభయ్య, టీపీసీసీ మేనిఫెస్టో కమిటీ సభ్యుడు చామల శ్రీనివాస్, ఎంపీ పీలు బచ్చుపల్లి శ్రీదేవీగంగాధర్, జెల్ల ముత్తి లింగయ్య, నాయకులు పన్నాల రాఘవరెడ్డి, సుంకరబోయిన నర్సింహ, లింగాల వెంకన్న, గాదగోని కొండయ్య, కౌన్సిలర్లు గాజుల సుకన్య, కందాల భిక్షంరెడ్డి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్, స్వామి పాల్గొన్నారు.

అడుగంటిన బావులు.. ఎండుతున్న పొలాలు

బొల్లేపల్లిలో అడుగంటిన బావి

మల్లారంలో ఎండిన వరి పైరు

● దయనీయ స్థితిలో రైతుల పరిస్థితి

కట్టంగూర్, మార్చి 20 : మండలంలోని బొల్లేపల్లి, మల్లారం, అయిటిపాముల, చెర్వు అన్నారం గ్రామాల పరిధిలోని ఏఎమ్మార్పీ ఆయకట్టు రైతుల పరిస్థితి అత్యంత దయనీయంగా మారింది. ఓ వైపు కాల్వకు నీటిని విడుదల చేయకపోవడం, మరో వైపు ఆయకట్టు పరిధిలో బావులు, బోర్లలో జలాలు అడుగంటిపోవడంతో రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. వరి పైర్లు నిట్టనిలువునా ఎండిపోతుండడంతో అన్నదాతల ఆశలు ఆవిరైపోతున్నాయి. ఈ మూడు గ్రామాల్లోని రైతులు 7,100 ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో సుమారు 2 వేల ఎకరాలు ఎండిపోయాయి. మరికొన్ని రోజులు ఇలాంటి పరిస్థితే ఉంటే పంట చేతికందడం కష్టమేనని రైతులు బోరుమంటున్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ఉదయసముద్రం నుంచి ఏఎమ్మార్పీ కాల్వకు నీళ్లు విడుదల చేయాలని రైతులు కోరుతున్నారు.



ఆలయంలో పూజలు నిర్వహించి మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత

● మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

మాడ్గులపల్లి, మార్చి 20 : ఆలయాల సందర్శనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని మాచనపల్లిలో చెన్నకేశవ, సీతారామచంద్రస్వామి ఆలయాల్లో ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి పూజలు చేశారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ సంప్రదాయాలను కాపాడుకోవాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రేగట్టె మల్లికార్జున్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు బోనగిరి దేవేందర్, కార్యదర్శి సందినేని జనార్దన్‌రావు, నాయకులు మెరుగు గోపి, దాసరి జానయ్య, మర్రి మదన్, శ్రీను, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రం పరిశీలన

అడవిదేవులపల్లి పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాస్‌రావు

అడవిదేవులపల్లి, మార్చి 20 : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాన్ని ఆర్డీఓ శ్రీనివాస్‌రావు బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు సమీపిస్తున్నందున మండలంలోని పోలింగ్ కేంద్రాలను సిద్ధం చేసుకోవాలని అధికారులకు సూచించారు. అనంతరం విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ కరుణాకర్, తాసీల్దార్ సురేశ్, ప్రధానోపాధ్యాయుడు అబ్బాస్ అలీ, సీనియర్ అసిస్టెంట్ అమీర్ అలీ, పంచాయతీ కార్యదర్శి వాసు ఉన్నారు.

అడవిదేవులపల్లి ఆర్ఐగా శ్యాంసుందర్

అడవిదేవులపల్లి, మార్చి 20 : మండల ఆర్ఐగా శ్యాంసుందర్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ పని చేసిన ఆర్ఐ రామకృష్ణ మిర్యాలగూడకు బదిలీ కాగా ఆయన స్థానంలో మిర్యాలగూడలో ఆర్ఐగా పని చేసిన శ్యాంసుందర్ ఇక్కడికి బదిలీపై వచ్చారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

శాలిగౌరారం, మార్చి 20 : డీసీఎంలో అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పట్టుకొని సీజ్ చేసినట్లు శాలిగౌరారం ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాలు.. మండలంలోని మాదారం కలాన్ గ్రామానికి చెందిన కట్టా ప్రవీణ్, భువనగిరికి చెందిన నరేశ్ పలు గ్రామాల్లో సేకరించిన 102 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని టీఎస్ 08యూబీ 5124 నంబర్ గల వాహనంలో బుధవారం తెల్లవారుజామున హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. ఈక్రమంలో మండలంలోని చౌళ్లగూడెం స్టేజీ వద్ద పోలీసులు వాహనానని పట్టుకొని శాలిగౌరారం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సివిల్ సప్లయ్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో డీటీ జ్యోతి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి బియ్యాన్ని పరిశీలించారు. పట్టుబడిన బియ్యాన్ని రేషన్ బియ్యంగా గుర్తించారు. నిందితులపై 6ఏ,420 యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపినట్లు ఎస్ఐ తెలిపారు. బియ్యాన్ని నకిరేకల్ ఎంఎల్ఎస్ కేంద్రానికి తరలించినట్లు చెప్పారు.

నాంపల్లి : అక్రమంగా తరలిస్తున్న 25 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ లచ్చిరెడ్డి తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బుధవారం తెల్లవారుజామున మండలంలోని పస్నూర్ గ్రామ శివారులో అశోక్ లేలాండ్ వాహనాన్ని తనిఖీ చేయగా పీడీఎస్ బియ్యాన్ని గుర్తించినట్లు తెలిపారు. బియ్యాన్ని తరలిస్తున్న బొడ్డుపల్లి స్వామి, జెనిగల మహేశ్‌పై కేసు నమోదు చేసినట్లు చెప్పారు.

ముమ్మరంగా పోలీసుల తనిఖీలు

నార్కట్‌పల్లి, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో పోలీసులు తనిఖీలు ముమ్మరం చేశారు. బుధవారం పలువురి నుంచి ఎలాంటి ఆధారం లేని రూ.5,12,000 సీజ్ చేశారు. అలాగే మండలంలోఅక్రమంగా నడుపుతున్న బెల్ట్ షాపులపై రైడ్ చేసి రూ.2,925 విలువైన మద్యం సీజ్ చేసినట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

హాలియా, మార్చి 20 : విద్యుత్ తీగలకు తాకుతున్న చెట్ల కొమ్మలను కొట్టేందుకు బుధవారం మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 6 గంటల వరకు132 కేవీ ఈశ్వర్‌నగర్ నుంచి హాలియాకు వచ్చే 33 కేవీ ఫీడర్‌కు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ బాలూనాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. పులిమామిడి, బంటువారిగూడెం, శ్రీనాథపురం, వెంకటాపురం, మారపాక, రాములుగు, చింతగూడెం, తిమ్మాపురం, కుపాసిపల్లికి విద్యుత్ సరఫరా నిలిచిపోనున్నట్లు తెలిపారు.

కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి

గుర్రంపోడు, మార్చి 20 : కరెంట్ షాక్‌తో వ్యక్తి మృతి చెందిన ఘటన బుధవారం మండలంలోని అమలూరులో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం వంగూరి నర్సింహ(52) ఇంట్లోని నీటి మోటార్‌ను చెక్ చేస్తుండగా కరెంట్ షాక్‌కి గురయ్యాడు. గమనించిన కుటుంబ సభ్యులు ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మరణించాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుమారుడు నరేశ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్ఐ శివప్రసాద్ తెలిపారు.

ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

నల్లగొండ, మార్చి 20 : బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడిగా పిట్టల శ్రీనివాస్ నియామకమయ్యారు. బుధవారం స్థానిక కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. శ్రీనివాస్ మాట్లాడుతూ తన ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు వర్షిత్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు మనోహర్‌రెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లుకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్నికలకు పకడ్బందీ ఏర్పాట్లు చేపట్టాలి

● కలెక్టర్ హరిచందన

చందంపేట : ఎన్నికల ఏర్పాట్లపై అధికారులకు సూచనలిస్తున్న కలెక్టర్ హరిచందన

చందంపేట(దేవరకొండ), మార్చి 20 : లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని కలెక్టర్ దాసరి హరిచందన అధికారులను ఆదేశించారు. బుధవారం దేవరకొండ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలోని డీఆర్‌సీ కేంద్రాన్ని ఆమె పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. ఆమె వెంట అదనపు కలెక్టర్ శ్రీనివాస్, దేవరకొండ ఆర్డీఓ శ్రీరాములు, డీఎస్పీ గిరిబాబు, తాసీల్దార్ సంతోష్‌కిరణ్, ఎంపీడీఓ సుదర్శన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి ఉన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలి

దేవరకొండ రూరల్ : విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని కలెక్టర్ దాసరి హరిచందన సూచించారు. బుధవారం మండల పరిధిలోని గిరిజన బాలికల డిగ్రీ రెసిడెన్షియల్ గురుకుల కళాశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తరగతి గదులను, భోజనశాలను పరిశీలించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్యామల, అధ్యాపకులు పాల్గొన్నారు.

డీఆర్సీ పరిశీలన

హాలియా : పట్టణంలోని ఐటీఐ కళాశాలలో డీఆర్సీ(డిస్ట్రిబ్యూషన్ అండ్ రిసెప్షన్ సెంటర్)ని కలెక్టర్ హరిచందన అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్‌తో కలిసి పరిశీలించారు. డీఆర్సీలో మౌలిక సదుపాయాలు, సీసీ కెమెరాల పనితీరు, ఎలక్ట్రిసిటీ, స్ట్రాంగ్ రూముల భద్రతను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. త్వరలో లోక్‌సభ ఎన్నికలు జరుగనున్నందున నియోజకవర్గంలోని ఓటర్లు తమ ఓటు హక్కు ఎక్కడ ఉందో ముందే చూసుకోవాలని సూచించారు.

జాతీయ బేస్‌బాల్ పోటీలకు పచ్చారిగడ్డవాసి

జూలకంటి శివ

మిర్యాలగూడ, మార్చి 20 : జాతీయ బేస్‌బాల్ పోటీలకు మండలంలోని పచ్చారిగడ్డ గ్రామానికి చెందిన జూలకంటి శివ ఎంపికైనట్లు బేస్‌బాల్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు అమరావతి సైదులు, చిర్ర మల్లేశ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 9న కరీంనగర్‌లోని అంబేద్కర్ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి జూనియర్స్ పోటీల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. ఈ నెల 22 నుంచి 26 వరకు పంజాబ్‌లోని సంగూర్‌లో జరిగే జాతీయ స్థాయి జూనియర్ బేస్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్రం తరపున ప్రాతినిధ్యం వహించబోతున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా శివకు బేస్‌బాల్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లేశ్, జేత్యా తండా మాజీ సర్పంచ్ పాశం నరసింహారెడ్డి, పరమేశ్, శంకర్, స్వామికుమార్, మహేశ్, పవన్, మురారి, రవి, జోజి, శివకుమార్, పీడీ వరమ్మ, మౌనిక, శోభ అభినందనలు తెలిపారు.

కలెక్టరేట్‌లో ఎంసీఎంసీ సెంటర్ ప్రారంభం

ఎంసీఎంసీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న డీఆర్ఓ రాజ్యలక్ష్మి

నల్లగొండ, మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా ప్రచురితమయ్యే రాజకీయ ప్రకటనలు, పెయిడ్ న్యూస్ పరిశీలన కోసం మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ కమిటీ(ఎంసీఎంసీ)ని ఏర్పాటు చేసినట్లు జిల్లా రెవెన్యూ అధికారి రాజ్యలక్ష్మి తెలిపారు. బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సర్టిఫికేషన్ అండ్ మానిటరింగ్ కమిటీ అండ్ మీడియా సెంటర్‌ను బుధవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఆర్ఓ మాట్లాడుతూ వార్తా చానళ్లలో ప్రసారమయ్యే రాజకీయ ప్రకటనలకు తప్పనిసరిగా ఎంసీఎంసీ ఆనుమతి తీసుకోవాలని సూచించారు. అలాగే ప్రింట్ మీడియాలో ప్రచురితమైన ప్రకటనలు, పెయిడ్ న్యూస్‌ను పరిశీలించేందుకు ఎంసీఎంసీ పనిచేస్తుందని తెలిపారు. అదేవిధంగా ఎన్నికలకు సంబంధించి సమాచారాన్ని మీడియా సెంటర్ ద్వారా ఎప్పటికప్పుడు మీడియా ప్రతినిధులకు తెలియజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంసీఎంసీ మెంబర్ సెక్రటరీ, డీపీఆర్ఓ వెంకటేశ్వర్లు, మీడియా రిలేషన్స్ నోడల్ అధికారి, జిల్లా పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వర్‌రావు, ఎంసీఎంసీ సభ్యులు, జిల్లా ఇన్ఫర్మాటిక్ అధికారి గణపతిరావు, సీనియర్ జర్నలిస్టు, ఎంసీఎంసీ సభ్యుడు శేషాచార్యులు, గృహ నిర్మాణ శాఖ పీడీ రాజకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలి

● సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి

రామగిరి, మార్చి 20 : యాసంగి కొనుగోలుకు ప్రభుత్వం తక్షణమే ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి బుధవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇప్పటికే బోర్ల కింద సాగుచేసిన వరి పొలాలను కోస్తున్నట్లు పేర్కొన్నారు. సగం పొలాలు కోసినా కొనుగోలు కేంద్రాలను ప్రారంభించకపోవడంతో రైతులు దళారీలకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే జిల్లా స్థాయిలో రాజకీయ పార్టీలు, రైతు సంఘాలు, మిల్లర్లతో సమావేశం ఏర్పాటు చేయాలని కలెక్టర్‌ను కోరారు.

మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు పూజలు

మిర్యాలగూడ రూరల్ : ధ్వజస్తంభానికి పూజలు చేస్తున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, విజయసింహారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి

మిర్యాలగూడ రూరల్, మార్చి 20 : మండలంలోని గూడూరులో నిర్మించిన రామాంజనేయ స్వామి, వెంటాద్రిపాలెంలో పునర్నిర్మించిన వీరబ్రహేంద్ర స్వామి ఆలయాల ప్రారంభోత్సవంలో మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహారెడ్డి, ఎంపీపీ నూకల సరళాహన్మంతరెడ్డి, మున్సిపల్ చైర్మన్ తిరునగర్‌భార్గవ్, రైతుబంధు సమితి జిల్లా మాజీ అధ్యక్షుడు చింతరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు మట్టపల్లి సైదులు, రైతు బంధు సమితి మాజీ మండలాధ్యక్షుడు గడగోజు ఏడుకొండల్, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, మాజీ సర్పంచ్‌లు బారెడ్డి అశోక్‌రెడ్డి, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● మండల వైద్యాధికారి ఉషారాణి

కొండమల్లేపల్లి, మార్చి 20 : పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల వైద్యాధికారి ఉషారాణి సూచించారు. మండలంలోని పెండ్లిపాకల గ్రామస్తులు విష జ్వరాలతో బాధపడుతుండడంతో కొండమల్లేపల్లి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో బుధవారం గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉషారాణి మాట్లాడుతూ.. గ్రామంలో జ్వరం, దగ్గు, జలుబు, ఒంటినొప్పులతో బాధపడుతున్న 100 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేసినట్లు తెలిపారు. మెడికల్ ఆఫీసర్ జబ్బార్, సీహెచ్ఓ హవిల్ కుమార్, హెచ్ఈఓ రవి, ఏఎన్ఎంలు స్వాతి, తిరుపతమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతి

కేతేపల్లి, మార్చి 20 : మండలంలోని ఇనుపాముల వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ధరణి ఆపరేటర్ మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. నకిరేకల్‌కు చెందిన సింగరి నరేశ్(32) ఏడాది నుంచి మండల కేంద్రంలోని తాసీల్దార్ కార్యాలయంలో ధరణి ఆపరేటర్‌గా పని చేస్తున్నాడు. బుధవారం విధులు ముగించుకొని సాయంత్రం బైక్‌పై ఇంటికి వెళ్తున్న క్రమంలో హైదరాబాద్ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సును ఓవర్‌టేక్ చేయబోయి బైక్ అదుపు తప్పి నరేశ్ కిందపడిపోయాడు. అతని పైనుంచి బస్సు వెళ్లడంతో అక్కడికక్కడే మరణించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం నకిరేకల్ ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

1450 కిలోల జిలెటిన్ స్టిక్స్ పట్టివేత

పట్టుబడిన జిలెటిన్ స్టిక్స్ వ్యాన్‌తో డీఎస్పీ రాజశేఖరరాజు, సిబ్బంది

నందికొండ, మార్చి 20 : నందికొండ పైలాన్‌కాలనీలోని తెలంగాణ, ఆంధ్రా సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద బుధవారం భారీగా పేలుడు పదార్థాలను పట్టుకున్నారు. ఎస్పీ చందనాదీప్తి తెలిపిన వివరాల ప్రకారం.. ఎన్నికల కోడ్ నేపథ్యంలో బుధవారం తెల్లవారుజామున నందికొండలోని సరిహద్దు చెక్‌పోస్ట్ వద్ద మిర్యాలగూడ డీఎస్పీ రాజశేఖరరాజు సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఈ క్రమంలో ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఏపీ 02ఎక్స్8272 నంబర్ గల వ్యాన్‌లో ఎలాంటి ఆధారాలు లేకుండా 1450 కిలోల జిలెటిన్ స్టిక్స్, 300 మీటర్ల పొడవు గల సేఫ్టీ ఫీజ్‌ను గుర్తించారు. వ్యాన్ డ్రైవర్ నాగేంద్రబాబును అదుపులోకి తీసుకొని విచారించగా ఆధారాలు చూపకపోవడంతో విజయపురి టౌన్‌పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి విచారణ చేపట్టినట్లు తెలిపారు. పేలుడు పదార్థాల వాహనానని పట్టుకున్న డీఎస్పీ రాజశేఖరరాజు, సీఐ బీసన్న, ఎస్ఐ సంపత్, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

కవాతులో పాల్గొన్న డీఎస్పీ గిరిబాబు, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ సిబ్బంది

దేవరకొండలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు

చందంపేట(దేవరకొండ), మార్చి 20 : లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో బుధవారం దేవరకొండ పట్టణంలోని ప్రధాన రహదారులు, పలు కాలనీల్లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా దేవరకొండ డీఎస్పీ గిరిబాబు మాట్లాడుతూ ఎన్నికల్లో ఓటర్లు నిర్భయంగా ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. ఎన్నికల నేపథ్యంలో ప్రజల్లో ఆత్మస్థైర్యం నింపేందుకు ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కవాతు నిర్వహించినట్లు తెలిపారు. దేవరకొండ రూరల్ సీఐ సురేశ్, ఎస్ఐ నర్సింహులు పాల్గొన్నారు.

భట్లపల్లిలో కారు బీభత్సం

మర్రిగూడ, మార్చి 20 : మండలంలోని భట్లపల్లిలో కారు అదుపుతప్పి బీభత్సం సృష్టించింది. బైక్‌ను ఓవర్ టేక్ చేయబోయి అతివేగంతో వెళ్లిన కారు రోడ్డు వెంట స్తంభాన్ని ఢీకొట్టి ఇంట్లోకి దూసుకెళ్లింది. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు.. మండల కేంద్రానికి చెందిన వ్యక్తి నాంపల్లి వైపు కారులో వెళ్తున్నాడు. భట్లపల్లి గ్రామంలో బైక్‌ను ఓవర్‌టేక్ చేయబోవడంతో అదుపు తప్పి రోడు వెంట ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. అదే వేగంతో పక్కనే ఉన్న మాదగోని వెంకటయ్య ఇంట్లోకి దూసుకెళ్లింది. దాంతో వరండా రేకులు ధ్వంసమయ్యాయి. ప్రమాదంలో కారు, ఇంటి ముందున్న రెండు బైకులు నుజ్జయ్యాయి. కారులోని ఎయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించి కేసు నమోదు చేశారు.

ఇంట్లోకి దూసుకెళ్లిన కారు

22న జాబ్‌మేళా

మిర్యాలగూడ, మార్చి 20 : పట్టణంలోని మినా మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో ఈ నెల 22న హైదరాబాద్‌కు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల చైర్మన్ మహ్మద్ అలీ, డైరెక్టర్ షహలాబుతుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బీటెక్, డిగ్రీలో ఉత్తీర్ణత పొందిన వారు జాబ్‌మేళాకు హాజరుకావాలని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని మిర్యాలగూడ పట్టణ, పరిసర ప్రాంతాల విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8580959390 నంబరల్ సంప్రదించాలని తెలిపారు.

రెండేళ్ల బీఈడీ కోర్సుకు దరఖాస్తులు

రామగిరి, మార్చి 20 : ఉపాధ్యాయ వృత్తిలో రాణించాలనే అభ్యర్థుల కోసం రెండేళ్ల బీఈడీ కోర్సులో ప్రవేశానికి రాష్ట్ర ఉన్నత విద్యామండలి 'టీఎస్ఎడ్‌సెట్–2024' నోటిఫికేషన్ విడుదల చేసిందని డీవీఎం విద్యా సంస్థల కరస్పాండెంట్ దొడ్డ శాంతికుమార్ బుధశారం ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులతోపాటు 2023–24లో డిగ్రీ చివరి సెమిస్టర్ చదివే వారు సైతం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దరఖాస్తులకు మే 5 చివరి గడువు అని, రూ.250 అపరాధ రుసుముతో మే 13 వరకు దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. https: //edcet.tsche.ac.inలో సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్
NAMASTHE TELANGANA CLASSIFIEDS

డాక్యుమెంట్ పోయినది
★ బీరప్పు నాగేశ్వరరావు S/o. యల్లయ్య, గ్రామం: వీర్లపాలెం, మం।। దామరచర్ల. నాకు సంబంధించిన ల్యాండ్ ఒరిజినల్ డాక్యుమెంట్ నెం. 1852/2016 గలది మిర్యాలగూడ నుండి హౌసింగ్ బోర్డుకు ఆటోలో వస్తుంటే పోయినది. దొరికినవారు సంప్రదించగలరు. 9440136907. NT-0000

FLAT FOR SALE
★ Ready to Move: Hayathnagar Near Vijayawada Highway Beside Bus Stop Sup. Luxurious 3BHK Flats, 2 Side 30' Rd. Ph: 9247326642 / 9849801477. NT-327957

PLOT FOR SALE
★ 5th ఏప్రిల్ న్యూ వెంచర్ లాంచింగ్ విజయవాడ హైవే, నార్కెట్‌పల్లి దగ్గర 4 లైన్ల రోడ్ ప్రక్కన ఆహ్లాదకరమైన వాతావరణం నందు కాంపౌండ్ వాల్, స్విమ్మింగ్ పూల్, క్లబ్‌హౌస్ సౌకర్యంతోపాటు ఎర్రచందనం & 40 రకాల పండ్లమొక్కలతో 10 గుంటల ప్లాట్లు కలవు. గజం: 2,199/- మాత్రమే. సంప్ర: 9346363436. NT-327974

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన లతితో క్షుణ్ణంగా విచారించి కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్